# ఇంటికొక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- నెల్లూరు జిల్లా తీర ప్రాంత మత్స్యకారుల కోసం మిని జెట్టీల నిర్మాణం చేపట్టండి

8లో

విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

బుధవారం 5 మార్చి, 2025 4 పేజీలు

## ఎంపీ వేమిరెడ్డి చొరవతో రైల్వే స్టేషన్లలో సమస్యలకు పరిష్కారం

**విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు:** నెల్లూరు జిల్లా పరిధిలోని రైల్వేస్టేషన్ల లో నెలకొన్న కనీస వసతులపై దక్షిణ మధ్య రైల్వే స్పందించి పరిష్కరించింది. నెల్లూరు జిల్లా పరిధిలో రైల్వే స్టేషన్ల పరిధిలో నెలకొన్న కనీస మౌలిక వసతులపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు లేఖ రాశారు. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు రైల్వేస్టేషన్ లో నీటి సమస్యలు, కావలి రైల్వే స్టేషన్ పరిధిలో చెత్త తరలింపు, వర్షాకాలంలో నీటి లీకేజీలు, ట్యాప్ కనెక్షన్లు, స్టేషన్ పరిధిలో బెంచీల ఏర్పాటు, ప్రయాణికులు కూర్చునేందుకు సరైన వసతులు లేకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. ఇక నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనుల్లో వేగం పెంచాల్సిన ఆవశ్యకతను లేఖ ద్వారా తెలియజేశారు. అలాగే స్థానికంగా అపరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ వంటి కనీస వసతులపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని లేఖలో పేర్కొన్నారు. దాంతో పాటు మనుబోలు రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యలను కూడా ప్రస్తావించారు. ప్రయాణికుల అవసరార్థం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఎంపీ కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రస్తావించిన సమస్యలను పరిశీలించిన జీఎం అరుణ్ కుమార్ జైన్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసి సమస్యలను పరిష్కరించినట్లు ప్రత్యేక లేఖ విడుదల చేశారు. అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికులకు ఎక్కడా అవస్థలు లేకుండా చూస్తామని, సిబ్బందిని కూడా అప్రమత్తం చేసి మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# 100 ఎకరాల ప్రభుత్వ భూమికి స్కెచ్

- కలువాయిలో భూ బకాసురులు
- తెలుగు రాయపురం భూ కబ్జాకి యత్నం
- రంగంలో దిగిన నెల్లూరులోని బడా నేతలు
- అన్నీ తెలిసినా నోరు మెదపని రెవెన్యూ అధికారులు

**విశాలాంధ్ర-కలువాయి:** మండల కేంద్రంలోని తెలుగు రాయపురం గ్రామంలో దాదాపు 100 ఎకరాల పైనే ఉంది. ఈ ప్రభుత్వ భూమిపై నెల్లూరుకు చెందిన బడా కాంట్రాక్టర్లు, కోటమీ సభ్యులు కన్ను పడింది, విషయంలోకి వెళితే, కడప జిల్లా, బద్వేల్ నుంచి, కృష్ణాపురం, కలువాయి మండలంలోని తెలుగు రాయపురం, కాకి వాయి, నాగల వెల్లటూరు, కనుపూరు పల్లి, చౌటపల్లి, చేజర్ల మండలం, ఆదురుపల్లి మీదుగా వెళుతున్న నేషనల్ హైవే 67 కృష్ణపట్నం వరకు శాంక్షన్ అయింది పనులు మాత్రం మొదలు కాలేదు. ఈ అవకాశాన్ని, కొంతమంది బడా వ్యక్తులు, ప్రభుత్వ భూమిని కాజై చేసేయందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే చాలా సంవత్సరాల క్రిందట అప్పటి వీఆర్వో దొంగ పట్టాలు సృష్టించి ఆ గ్రామానికి సంబంధించి కాక కలువాయి మండలం రాజుపాలెం గ్రామానికి సంబంధించి కొంతమంది వ్యక్తులకు పట్టాలు చేసినట్లు సమాచారం, అయితే తెలుగు రాయపురం గ్రామస్తులు, ఒప్పుకో పోవడంతో అప్పటిలో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది, అయితే ఈ నేషనల్ హైవే 67 వచ్చినప్పుడు నుంచి నెల్లూరులోని, బడా బాబు కన్నులు, ఈ గ్రామం పై పడ్డాయి, దాదాపు కొన్ని కోట్ల రూపాయలపై కన్నేసి, అప్పుడులో కోర్టులో వేసిన వారితో ఒక ఎకరాకి ఒక లక్ష 20000, ప్రజా ప్రతినిధులకు రెండు లక్షలు డీలు కుదుర్చుకున్నట్లు, విశ్వ నీయస సమాచారం, దీనికి ఒక ఉదాహరణ, ఈనెల ఆదివారం రోజు ఆ సచివాలయం సర్వేయర్‌కి తెలియకుండానే కలువాయిలో విధులు నిర్వహిస్తున్న సర్వేర్‌ని తీసుకెళ్లి డ్రోన్ ద్వారా సర్వే చేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, ఈ అక్రమాలను అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## సీఎం పాలనా దక్షతకు బడ్జెట్ అద్దం పడుతోంది

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌పై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసలు గుప్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాలనా దక్షతను కొనియాడారు. ఈ మేరకు సోమవారం బడ్జెట్‌పై సమావేశం సందర్భంగా ఆమె అసెంబ్లీలో మాట్లాడారు.2025-26 బడ్జెప్ పై సభలో తనకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పాలనా దక్షతకు బడ్జెట్ అద్దం పడుతోందని, పేదలను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ రూపొందించారన్నారు. చంద్రబాబు రూపకల్పన చేసిన స్వర్ణాంధ్ర -విజన్ 2047ను సాకారం చేసే దిశగా బడ్జెట్ ఉందన్నారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన, నిర్లక్ష్యంతో ఆర్థికంగా కుదేలైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టిని కలిగించే విధంగా బడ్జెట్ రూపొందించినందుకు సభా ముఖంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రాష్ట్రాభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు చేయడం ద్వారా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థమవుతోందని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, జల వనరులు, రహదారుల అభివృద్ధి, పింఛన్లు, ఐటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా సంక్షేమానికి ఉదారంగా కేటాయింపులు జరిపి అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను నిరూపించారన్నారు.బడ్జెట్ లో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, మహిళా శిశు సంక్షేమానికి రూ. 4332 కోట్లు కేటాయించడం గర్వించదగిన విషయమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇప్పటికే దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తూనే, తల్లికి వందనం పథకానికి రూ. 9,407 కోట్లు కేటాయించారన్నారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు మేలు చేసేలా అంగన్వాడీల గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025-26 బడ్జెట్ లో 60 కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. అంగన్వాడీల నిర్వహణకు రూ. 878 కోట్లు కేటాయించ ద్వారా వాటి బలోపేతానికి సహకారం అందించారని కొనియాడారు. ఇక నెల్లూరు జిల్లాకు 2025-26

2లో

## వీసీల రాజీనామాలపై విచారణకు పట్టుబట్టిన చంద్రశేఖర్ రెడ్డి

### ఆధారాలను చూసి వెనుకడుగు వేసిన లోకేష్

**విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు:** శాసనమండలి సమావేశా ల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి 17 మంది విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్ల బలవంతపు రాజీనామా లపై స్పీకర్ ద్వారామంత్రి లోకేష్‌కు ఆధారాలు అందజేసి మాట్లాడారు. గవర్నర్ ఆమోదంతో మాత్రమే యూనివర్సి టీల్లో వైస్ ఛాన్స్ లర్ల ను నియమించడం.. తొలగించడం జరుగుతుందని అన్నారు. వైస్ చాన్స్ లర్లను రాజీనామాలు చేయమని చెప్పడానికి ఏ సంబంధం లేని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యార్ ఎడ్యుకేషన్ కు, ప్రభుత్వానికి ఏమీ హక్కు ఉందని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి తెలుగుదేశం పార్టీ రాజకీయ కుట్రెనన్నారు. జూన్ 26వ తేది నుంచిజూన్ 30 వరకు కేవలం నాలుగు రోజుల వ్యవధిలో 17 మంది వైస్ ఛాన్స్ లర్లు రాజీనామాలు చేస్తే ఎందుకు దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించలేదని ప్రశ్నించారు. ఈ విషయాలన్నిటినీ ప్రశ్నిస్తుంటే మంత్రి లోకేష్ 2019లో వైసిపి ప్రభుత్వంలో వీసిల రాజీనామాల విషయాన్ని ప్రస్తావించడం హాస్యాస్పదమన్నారు. అది టీడీపీ చేసిన తప్పిదాల కారణంగా కోర్టు నిర్ణయం ప్రకారం జరిగిన అంశమే తప్ప రాజకీయ అంశం కాదు అని దానికి సంబంధించిన కోర్టు ఉత్తర్వులను చైర్మన్ కి అందచేశారు 2019 నుంచి యూజీసీ నిబంధనల ప్రకారం తమ ప్రభుత్వం యుజిసి సెర్చ్ కమిటీ ఏర్పాటు చేసిన నిబంధనలు ప్రకారమే.. వైస్ ఛాన్సర్లను నియమించడం జరిగిందన్నారు. 17 మంది విసిల రాజీనామాలపై శాసన మండలికి తాము సమర్పించిన ఆధారాలను పరిగణలోకి తీసుకొని విచారణ జరిపించాలనిమంత్రి లోకేష్‌ను చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై లోకేష్ వెనకడుగు వేయడం జరిగిందని ఎంఎల్‌సి చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు.

## బడ్జెట్ అద్దం పడుతోంది

(మొదటి పేజీ తరువాయి) ఆర్థిక బడ్జెట్ లో భారీ కేటాయింపులు చేసిన కారణంగా సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకు చెందిన సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. తెలుగు గంగ ప్రాజెక్టుకు బడ్జెట్లో రూ.345 కోట్లు, సోమశిల జలాశయానికి రూ.266 కోట్లు కేటాయించి అభివృద్ధికి బాటలు వేశారని ప్రశంసించారు. జిల్లాకు తలమానికమైన విక్రమ సింహపురి యూనివర్సిటీకి రూ.20.53 కోట్లు కేటాయించడం కొత్త పరిశోధనలకు తోడ్పాటు అందనుండటం సంతోషం కలిగించే అంశం. అలాగే రామాయపట్నం పోర్ట్ కు రూ.100 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో 1.77 లక్షల మంది రైతులకు 247 కోట్లు పంపిణీ కాబోతున్నాయని, జిల్లాలో 12 వేల మంది మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం పెంచిన విధంగా వేట నిషేధ భృతి అందజేస్తామని స్పష్టం చేశారు. అలాగే కొవడలూరు మండలంలో ఉన్న కిసాన్ సెజ్‌కు నిధులు కేటాయిం చాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానని, ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో తాను నిత్యం ప్రజా సేవలో ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు.

## చెరువుకట్ట గిరిజన కాలనీలోని పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-కావలి: కావలి పట్టణం నివాసులు యెండ్లూరి సురేష్ బాబు వారి తండ్రి కీశే యెండ్లూరి సుబ్బానాయుడు 5వ వర్ధంతి సందర్భంగా కావలి పట్టణం పెంకుల ఫ్యాక్టరీ చెరువుకట్ట గిరిజన కాలనీలోని పేదలకు సంయుక్త సేవా సంస్థ ద్వారా అన్నదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో దాత యెండ్లూరి సురేష్ బాబు, దాత కుటుంబ సభ్యులు మరియు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ యెండ్లూరి. సురేష్ బాబు వారి తండ్రి జ్ఞాపకార్థంగా గిరిజన కాలనీలోని పేదలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. అలాగే వారి తండ్రి యెండ్లూరి సుబ్బానాయుడి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు.

## మాచవరంలో సీనియర్ లైన్‌మన్లకు సన్మానం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: లైన్ మాన్ డే సందర్భంగా మాచ వరం సబ్‌స్టేషన్ నందు మాచవరం "యం పి టి సి "దండే కోటేశ్వరరావు క్రిష్టపాటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మాచవరం లైనమన్ ప్రసాద్‌ని మోపాడు లైన్మెన్ గద్దె గోపి ని కందుకూర్ పట్టణ లైన్మెన్ సి హెచ్ నాగేశ్వరావుని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కావలి వశిష్ట జూనియర్ కాలేజీ డైరెక్టర్ కె.సురేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ ఇర్ల శ్రీనివాసులు పాల్గొనడం జరిగింది. అలాగే తోటి కార్మిక సోదరులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. విద్యుత్ సిబ్బందికి లైన్మెన్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి. విద్యుత్ ఉద్యోగులు అందరు కూడా భద్రతలు పాటించి ప్రమాదాలు జరగకుండా ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమం లో కళ్యాణ్ చక్రవర్తి, రసూల్. దండే రవి కుమార్. ఈమని కృష్ణారెడ్డి. కొండలు ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు

## భేటీ బచావో - బేట పడావో

విశాలాంధ్ర-గుడ్లూరు: మండలంలోని గుడ్లూరు 2 సెక్టార్ లోని చిన్న లాటరీపి పంచాయతీలోని హైస్కూల్లో కిషోరి బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. కిషోర్ బాలికలను ఉద్దేశించి వారు బాల్య వివాహాలు చేసుకోకూడదని, 18 సంవత్సరాలు నిండా కుండా వివాహం చేసుకోకూడదని, వ్యక్తిగత శుభ్రత గురించి, పౌష్టిక ఆహారం గురించి సెక్టార్ సూపర్వైజర్ కె.కోటేశ్వరి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో కిషోరి బాలికలకు పౌష్టికాహారం బాగా తీసుకోవాలని సూపర్‌వైజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నలాటరీపి హెచ్ఎం, పి.లక్ష్మి కార్యకర్త, మహిళా పోలీస్ డి.జ్యోతి పాల్గొన్నారు.

## 8న మహిళా సమస్యలపై సదస్సు

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని రామకోటయ్య భవన్ (సిపిఐ ఆఫీస్) నందుమార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించడం జరుగుతుందని నెల్లూరు నగర పార్టీ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకుగాను సన్నాహక ఏర్పాట్లపై నెల్లూరు నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు నగర సిపిఐ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి మాట్లాడుతూమహిళ సంఘం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించాలని రాష్ట్ర మహిళా సంఘనాయకులను కూడా ఆహ్వానించాలని అన్ని ప్రాంతాలను మహిళలను ఆహ్వానించాలని ఈ సమావేశం తీర్మానించింది. మార్చి 8వ తేదీ ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని ఈ సదస్సులో అన్ని వర్గాల మహిళలు పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేయాలని సాయి కోరారు. నెల్లూరు నగరా మహిళా సంఘంనాయకు రాళ్లు వనజ, సోఫియా, సాయిలత, లక్ష్మీ, సుహాన, మిష్కాత్, శిరీష ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జిలాని ఖాన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలికను గంటలో ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: నెల్లూరు టౌన్ ముంగమూరివారి వీధికి చెందిన 3 సంవత్సరాల బాలిక మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఆడుకుంటూ ఏటో వెళ్లిపోయిందని చిన్నబజార్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చిన తల్లిదండ్రులు చిన్న బజార్ సీఐ సూచనలతో ప్రత్యేక పోలీసు బృందంతో బాలిక ఆచూకీ కోసం హుటాహుటిన గాలింపు చర్యలు చేపట్టాయి. బాలిక తప్పిపోయరని సమాచారం రాగానే వేగంగా స్పందించిన చిన్నబజార్ పోలీసులు. జిల్లా యస్పి ఆదేశాల మేరకు సాంకేతికతను వినియోగించి క్షుణ్ణంగా శోధించిన చిన్న బజార్ పోలీసులు. చుట్టుపక్కల వీధులలో జల్లెడ పట్టి, ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు. అందుబాటులో ఉన్న సిసి ఫుటేజ్ ల ఆధారంగా, శోధించుకుంటూ వెళ్ళగా, కాపు వీధిలో తిరుగుతున్నట్లు సంచారం మేరకు బాలికను క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రుల చెంతకు బాలికను చాకచక్యంగా 1గంట 30 నిముషాలలోపు చేర్చిన చిన్న బజార్ పోలీసులను శభాష్ అంటున్న ప్రజలు.బాలిక దొరకడంతో ఆనందబాష్పాలతో కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు. చిన్న బజార్ పోలీసులను అభినందిస్తున్న తల్లిదండ్రులు, ప్రజలు తప్పిపోయిన బాలిక ఆచూకీ గంటలో కనుగొన్న పోలీసు బృందాన్ని జిల్లా యస్పి అభినందించారు.

## జోరేపల్లి, సిద్దవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలం లోని జోరేపల్లి, సిద్దవరం గ్రామలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగిందని ఇందులో భాగంగా రాపూరు మండలంలో వరి పండిస్తున్న రైతులకు పండించిన వరి పంటను, పంట వివరములు, వరి రకమును ధాన్యం కొనుగోలు కేంద్రాలు అనగా రైతు సేవ కేంద్రలకు సంబంధించిన పంట షెడ్యూల్,పంట కోతకు వచ్చే తేది వివరములు నమోదు చేసుకోవలేనని రాపూరు మండల వ్యవసాయ అధికారి సోము సుందరం తెలియజేశారు.

## ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలి

విశాలాంధ్ర-ముత్తుకూరు: ప్రతి మహిళ ఆనందంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉన్నట్టేనని ఐసిడిఎస్ సూపర్వైజర్ అమ్మనమ్మ తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని గొల్ల వీధి గిరిజన కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో మహిళ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ అమ్మనమ్మ మాట్లాడుతూ ప్రతి మహిళ సరైన ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉంటే, తన కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉన్నట్లేనని ఆమె తెలిపారు. కుటుంబ పరంగా ప్రతి మహిళ తన ఆరోగ్యం విస్మరించి కుటుంబమే ముఖ్యమని సక్రమంగా ఆహారం తీసుకోకపోవడం వల్ల ఆమె అనారోగ్యం పాలు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు. అలాగే పంటపాలెం సెక్టర్ లో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ సుబ్బమ్మ, పిడత పోలూరు సెక్టర్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ మంజుల మహిళ వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు.

## తలసేమియా వ్యాధి పీడిత బాలలకు అండగా రెడ్ క్రాస్

### తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వహణాధికారిణి డాక్టర్ రమ్య

విశాలాంధ్ర-దగదర్తి: తలసేమియా వ్యాధి పీడిత బాలలకు రెడ్ క్రాస్ అండగా ఉంటుందని రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వహణాధికారిణి డాక్టర్ రమ్య తెలిపారు. మంగళవారం వెంగళరావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ లో జరిగిన ఆశా దినం సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిని గుర్తించడంపై సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తలసేమియా పుట్టుకతో వచ్చే జన్యుపరమైన వ్యాధి అని అన్నారు. ఈ వ్యాధి ఉన్న పిల్లలకు బోన్మారో నుండి రక్తం ఉత్పత్తి కాదని, వారి ప్రాణాలు కాపాడాలంటే తరచూ రక్తం ఎక్కించాలని అన్నారు. సామాజిక ఆరోగ్య అధికారులు, కార్యకర్తలు తమ పరిధిలోని రక్తహీనత కలిగిన పిల్లలను కనిపెట్టి, రెడ్ క్రాస్ కు సమాచారమిస్తే, తాము వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధి ఉన్నవారికి ప్రతి నెలా రక్తం ఎక్కించడంతో పాటు, మందులు, బలవర్ధక ఆహారం ఉచితంగా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ తలసేమియా ఆసుపత్రి కన్వీనర్ కె.హరినారప రెడ్డి, సభ్యులు కల్లయ్య, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు డాక్టర్ మేఘనాథ్, డాక్టర్ ఫరూక్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కలవల్ల అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: కందుకూరు ప్రాజెక్ట్ వలేటివారిపాలెం మండలం కలవల్ల గ్రామంలో సీడీపీఓ సూచనల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ సునీత, మహిళా పోలీస్ శైలజరాణి, అంగన్వాడీ కార్యకర్తలు గోవిందమ్మ, విజయం, మల్లిక, సుజాత ఆయాలు నారాయణమ్మ, యాగశ్రీ గ్రామస్థులు పాల్గొన్నారు.

## తెల్లగుంటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర-బిట్రగుంట: కావలి ఐసిడిఎస్ ప్రాజెక్టుపరిధిలోని బోగోలుమండలంతెల్లగుంటలో ప్రాజెక్టు అధికారులు సౌజన్య, శారద ఆదేశాలమేరకు సెక్టార్ పర్యవేక్షణ అధికారికోటేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా గ్రామంలోని గర్భవతులు, బాలింతలు, కిషోరీ బాలికలకు ఆరోగ్య మహిళ ఆనందమహిళ, అంగన్వాడి సేవలు, పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో (మిల్లెట్స్) సజ్జలు రాగులు, జొన్నలు, మినుములు మొదలగు పప్పుధాన్యాల వినియోగం వలన కలిగే ప్రయోజనాలు, వ్యక్తిగత పరిశుభ్రత బాల్యవివాహాలు వలన కలిగే అనర్థాలు, మహిళలభద్రత, బ్యాడ్ టచ్ గుడ్ టచ్ వంటి అంశాలపై అవగాహనకలిగించారు. పై కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అనిత, కృష్ణమ్మ, శ్రీలత, సుచరిత, ఆశాకార్యకర్త గ్రామంలోని మహిళలు, కిశోరీబాలికలు తదితరులుపాల్గొన్నారు.

## చేవూరు రావూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

విశాలాంధ్ర-గుడ్లూరు: మండలంలోని చేవూరు, రావూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. వ్యవసాయ శాఖ మరియు అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమములో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ సీజనులో ఈ -పంట చేయించుకున్నా ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా ఫార్మర్ ఈ కేవైసీ తప్పనిసరిగాచేయించుకోవాలయును. ఏవరైనా ఇంకనూ మిగిలియున్నా రైతులు మీయొక్క రైతు సేవా కేంద్రం నందుగల గ్రామ వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులను సంప్రదించి చేయించుకోవాలసినదిగా మనవి. ఈ కార్యక్రమములో నాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.రఘు, పి.శైలజ, రైతులు పాల్గొన్నారు.


మహారాజశ్రీ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జీ వారి కోర్టులో

ఎఫ్.డి.నెం.1/2023, ఓ.ఎస్.నెం.8/2013

నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్, రిప్రెజెంటెడ్ బై ఇట్స్ ఆథరైజ్డ్ ఆఫీసర్ మరియు జి.పి.ఎ హోల్డర్ కె.శ్రీనివాస్ - పిటీషనర్/వాది

వర్సెస్

మెసర్స్ గణేష్ రైస్ మిల్, రిప్రెజెంటెడ్ బై ఇట్స్ మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి యం.ఉమాదేవి మరియు మరికొందరు - రెస్పాండెంట్లు/ప్రతివాదులు

టు: 3వ రెస్పాండెంట్:
సి.హెచ్.హరి ప్రసాద్, తండ్రి కోటిలింగం, హిందువు, వయస్సు షుమారు 44 సం॥లు, బిజినెస్, నివాసం: యల్.రాజుపాలెం, ఉలవపాడు మండలం, యస్.పి.యస్.ఆర్ నెల్లూరు జిల్లా.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో పిటీషనర్ మార్ట్‌గేజ్ బాకీ వసూలు నిమిత్తము మార్ట్‌గేజ్ డిక్రీ షెడ్యూలు ఆస్తిని వేలం వేయుటకుగాను పర్మిషన్ కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్ పై ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా తేది: 11-03-2025 ది పై కోర్టులో యున్నది. మీరు వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగాగాని లేదా మీ వకీలుగారి ద్వారాగాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపకొనవలయును. లేనిచో మీ పరోక్షమున సదరు పిటీషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

గొట్టిపాటి శ్రీనివాసరావు, పిటీషనర్ తరుపున అడ్వకేట్ ఒంగోలు, సెల్ 98482 12516

స్థలం : ఒంగోలు, తేది : 27-2-2025

# కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

## - సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి

**విశాలాంధ్ర-దగదర్తి:** కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి తెలిపారు. మంగళవారం కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదేశానుసారం దగదర్తి మండలం కొత్తపల్లి కౌరుగుంట గ్రామ పంచాయతీలో అంబటి రమేష్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పమిడి రవి కుమార్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో సీసీ రోడ్లు వేసిన పరిస్థితి కాదు కదా? తట్ట మట్టి పోసిన దాఖలాలు లేవన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. దగదర్తి ఎయిర్ పోర్టు, జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం ఓడ రేవులతో భారీ పరిశ్రమలు రానున్నాయని, బ్రాహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పిన విధంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కావలి కనక పట్టణం కాబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రామూర్తి, దయాకర్, సునీల్, ఆనంద్, పాల్, తిరుపతి, మందా శీనయ్య, వట్టికాళ్ళ శీనయ్య, గ్రామ ప్రజలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎనర్జీ భద్రతకు సెయిల్ పెద్దపీట

**విశాలాంధ్ర-ముత్తుకూరు:** భారతదేశంలోని అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఎనర్జీ భద్రతకు పెద్దపీట వేసిందని ఓ అండ్ ఎం. హెడ్ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని నేలటూరు పంచాయతీ పరిధిలో ఉన్నసెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ 54వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి సునీల్ కుమార్ మాట్లాడుతూ విక్షిత్ భారత్‌కు భద్రత, శ్రేయస్సు చాలా కీలకం అనే అంశాన్ని ప్రతిధ్వనిస్తూ, భద్రత, శ్రేయస్సు పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించిందన్నారు. సెయిల్‌లో భద్రత అత్యంత ముఖ్యమైన దని, అందరికీ సురక్షితమైన కార్యస్థలం అందించడానికి మేము కృషి చేస్తున్నామని నొక్కి చెప్పారు. భద్రత అంశంపై ఉద్యోగుల కోసం నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమములో విభాగాధిపతులు హెచ్ఓడి లు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మహిళల్ని కించపరిచేలా ఆ ఆచార్యుడు

**విశాలాంధ్ర-కావలి:** కావలి పట్టణంలోని విక్రమ సింహ పురి విశ్వవిద్యాలయ పీజీ కళాశాలలో ఓ అధ్యాపకు డు సహచర మహిళలను అడుగడుగున కించపరిచే లా వ్యవహరిస్తున్నాడు. మరో నాలుగు రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకోనున్న దశలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పేరుకు మాత్రమే నారీ సంరక్షణ అంటూ ప్రవచనాలు చెప్పుకుంటూ పోతున్నా మరోపక్క అతివలు పడుతున్న అవస్థలు మాత్రం వర్ణనాతీతంగా ఉన్నాయి. కావలి పీజీ కళాశాలలో ఆ ప్రబుద్ధుడి వ్యవహార శైలితో ఇబ్బంది పడని మహిళ అంటూ లేదు. అతని వేధింపులు తాళలేక గతంలో ఓ మహిళా సహాయ ప్రొఫెసర్ ఆత్మహత్యాయత్నానికి సైతం ఒడిగట్టారు. అతగాడికి మరో ఇద్దరు తాత్కాలిక సిబ్బంది సైతం వంత పాడటం మహిళా సిబ్బందిని మరింతగా మనస్థాపానికి గురిచేస్తుంది. కావలిలో విధులు వెలగబెడుతూనే ఆ ఘరానా నిందితుడు ఏకంగా నెల్లూరులోని విశ్వవిద్యాలయ పెద్దలను సైతం బ్లాక్ మెయిల్ చేసే దుస్సంస్కృతిని కొనసాగిస్తున్నాడు. ఆయనపై సమగ్రంగా విచారణ చేసి విశ్వవిద్యాలయ పరువు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## హెల్మెట్ ధారణ తప్పనిసరి: సామాజికవేత్త మాలకొండ రెడ్డి

**విశాలాంధ్ర-కావలి:** సమాజంలో ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తద్వారా రక్షణ పొందాలని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికారిక సంస్థ ఆదేశాల మేరకు మోటారు వాహనాల చట్టం ప్రకారం హెల్మెట్ ధారణ పై అవగా హన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా మాలకొండ రెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోధకులు హెల్మెట్లు వాడకుండా వాహనాలు నడిపితే వారికి అపరాధ రుసుము కూడా వేస్తారు. కాబట్టి ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని ద్విచక్ర వాహన చోదకులు ఈ చట్టాన్ని గౌరవించి హెల్మెట్ ధారణతప్పనిసరిగా వినియోగించి తాను రక్షణ పొంది కుటుంబానికి అండగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రయాణంలో ప్రమాదాలు నుండి రక్షణ పొందాలి అంటే తప్పనిసరిగా హెల్మెట్ ధారణ కచ్చితంగా అమలు జరపాలని ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో న్యూట్రిషన్ పై అవగాహన: సిడిపిఒ సునంద

**విశాలాంధ్ర-రాపూరు:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఈ నెల 1వ తేది నుండి 8వ తేది వరకు జరిగే వారోత్సవాలలో భాగంగా రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సునంద అదేశాలు మేరకు జరుగు తున్న మహిళా దినోత్సవ వారోత్స వాలలో మంగళవారం రాపూరు మండలంలోని గోనుపల్లి సెక్టర్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన సిడిపిఓ సునంద ప్రత్యక్ష పర్యవేక్షణ లోగోను పల్లి సెక్టర్ పరిధిలోని ఆకలి వలస పంచాయతీ పరిధిలోని ఓబులాయ పల్లి అంగన్వాడి సెంటర్ 1లో జరిగిన కార్యక్రమంలో సిడిపిఓ సునందా మాట్లాడుతూ భ్రూణ హత్యల గురించి ఆడబిడ్డలను రక్షించండి, ఆడబిడ్డలను చదివించండని, 18 సంవత్సరాలు నిండేవరకు ఆడపిల్లలకు వివాహం చేయరాదని ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత గురించి హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి, అత్యవసర ప్రమాదంలో వున్నప్పుడు ఈనెంబర్లకు ఫోన్ చేయాలని 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ఉమెన్ హెల్ప్ లైన్ 181, జాతీయ అత్యవసర హెల్ప్ లైన్ 112, సైబర్ నెరాల హెల్ప్ లైన్ 1930, ఎల్పీజీ గ్యాస్ హెల్ప్‌లైన్ 1906, రోడ్డు ప్రమాదాల హెల్ప్‌లైన్ 1073, పైన కనుపరిచిన నెంబర్ల గురించి సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి

### లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి

**విశాలాంధ్ర-కావలి:** మార్చి 8న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని కక్షి దారులకు లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి తెలిపినారు. కోర్టుకు రాని కేసులు పెండింగ్ కేసులు ఖర్చు కాలయాపన లేని అప్పిల్ లేని అంతిమ తీర్పులను లోక్ అదాలత్‌లో ఇవ్వటం జరుగుతుందని తెలిపినారు. అలాగే కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో మార్చి 8 శనివారం కావలిలో జరుగు మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లో నిరుపేదలకు, ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత న్యాయ సహాయము న్యాయ సలహాలు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపినారు. ఈ మెగా జాతీయ లోక్ అదాలత్‌లో కొండాపురం, జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు, మండలాల నుండి కక్షిదారులు సత్వర న్యాయం కొరకు ఈ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకొని ప్రశాంతంగా జీవించాలని తెలిపినారు

## నిరుపేద కోటేశ్వరిని అన్ని విధాల ఆదుకుంటాం

**విశాలాంధ్ర-కావలి:** కావలి వడ్డీపాలెం కనక దుర్గమ్మ ఆలయం ప్రక్క న నివాసం ఉంటుంటు న్ననిరుపేద కోటేశ్వరి, వెంకటేశ్వర్లు కుటుం బం... ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన గృహము పూర్తిగా దగ్ధమై, కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యంలో... రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు, విశ్రాంత లెక్చరర్ ఎం.వి.ప్రసాద్ రావు విషయం తెలుసుకొని, వారి దాతృత్వముతో స్వర్గీయ రత్నమ్మపేరు మీద.. కోటేశ్వరి కుటుంబమునకు, బియ్యం, నిత్యావసర వస్తువులు, వంటపాత్రలు, అందచేయడం జరిగింది. ఊహించని విపత్కర పరిస్థితిలో ఆ కుటుంబం రోదిస్తుంది. ఆకుటుంబంను మానవతా దృక్పథంతో ఆదుకోవలసిన అవసరం ఎంతయినా ఉన్నది. ఈ సందర్భముగా... రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.వి.ప్రసాద్ రావు, విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారి షేక్. బాష, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అజిత్ బాబు, విశ్రాంత ఉపతాసీల్దార్ మొఘల్ శిరాజ్ బేగ్, సంయుక్త సేవా సంస్థ జి.సురేంద్ర హ్యాపీ సేవా సంస్థ ఘనిబాష హాజరై ఆ కుటుంబమును, ఓదార్చి, పరామర్శించి, మనోధైర్యమును కల్పించడం జరిగింది.

## ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు: సిడిపిఓ

**విశాలాంధ్ర-రాపూరు:** రాపూరు ఐసి డిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాపూరు మండల సెక్టార్ సూపర్ వైజర్ల పరిధిలోని గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో సిడి పిఓ సునంద అదేశాలు మేరకు ఈ నెల 1వ తేది నుండి 8 వతెది వరకు జరిగే అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా రెండవ రోజు మంగళవారం రాపూరు సెక్టారు సూపర్ వైజర్ రాధిక అధ్వ ర్యంలో సిద్ద వరం గ్రామంలోని హై స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో రాధిక మాట్లాడుతు పోషణలో మిలెట్స్ (రాగులు, సజ్జలు, జొన్నలు, మినుములు) గురించి, వ్యక్తిగత పరి శుభ్రత గురించి, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ గురించి తెలియజెప్పారు. ఆడ పిల్లలకు 18 సం నిండెవరకు వివాహం చేయరాదని తెలియజేశారు. మహిళా భద్రత గురించి పలు విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ప్రమీల, సుభాషిణి, వరలక్ష్మి, రామకోటి, శిరషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వేపినాపి సెక్టర్ సూపర్‌వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో వేపినాపి అంగన్వాడి కేంద్రంలో తల్లులకు, పిల్లలకు, విద్యార్థులకు యోగా న్యూట్రిషన్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ మహిళలు ప్రమాద స్థితిలో వున్నప్పుడు ఉమెన్ హెల్ప్ లైన్ 181 నెంబర్‌కు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నెంబర్‌కు ఫోన్ చేయాలని, ఆడపిల్లల వ్యక్తిగత పరిశభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు, పిల్లలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటికొక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- నెల్లూరు జిల్లా తీర ప్రాంత మత్స్యకారుల కోసం మిని జెట్టీల నిర్మాణం చేపట్టండి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షల మేరకు ఇంటికొక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న లక్ష్యాన్ని సాధించడంలో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ప్రైసెస్ మంత్రిత్వ శాఖ క్రియాశీలకంగా పని చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం అసెంబ్లీలో ఎంఎస్ఎంఈల స్థాపనలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఆమె పలు అంశాలను ప్రస్తావించారు. కోవూరు నియోజకవర్గంలో ఇఫ్కో కిసాన్ సెజ్, ఏపీఐఐసీ భూములతో పాటు కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి చెందిన 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు అందుబాటులో వున్నాయన్నారు. ప్రభుత్వ చొరవ చూపి ఎంఎస్ఎంఇ కింద ప్రోత్సాహకాలు అందిస్తే స్థానికంగా పరిశ్రమలు స్థాపన ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకై ఎంఎస్ఎంఈల స్థాపనకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక ఓరియంటేషన్ శిక్షణ అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అటు రాయలసీమ జిల్లాలు మొదలు నెల్లూరు, ప్రకాశం జిల్లాల వరకు రైతులు వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునేందుకై మెగా అగ్రికల్చర్ యార్డ్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రస్తావించారు. నెల్లూరు జిల్లాలోని సముద్రతీర ప్రాంతంలో యిసుక మేట కారణంగా మత్స్యకారులు సముద్రంలోనికి పడవలు తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని తీరప్రాంతమంతా డెడ్జింగ్ చేయడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో కోవూరు నియోజకవర్గ పరిధిలోని సముద్రతీర ప్రాంతంలో మిని జెట్టీల నిర్మాణం చేపట్టి మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రశ్నకు ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానమిస్తూప్రతి జిల్లాలలో ముగ్గురు ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్స్‌ను నియమించి ఎంఎస్ఎంఈ స్థాపన పట్ల ఆసక్తి చూపే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ పాలసీలు సంబంధించి అవసరమైనసమాచారం అందిస్తామన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా వక్తృత్వపు పోటీలు

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: జిల్లా యస్పి. జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు, అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సౌజన్య సూచనల మేరకు, టౌన్ డిఎస్పి సింధు ప్రియ ఆధ్వర్యంలో, ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు పాఠశాల కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు,సోషల్ మీడియాలో మహిళల గోప్యతకు డిజిటల్ భద్రత అవసరం, ఆత్మరక్షణ అనేది ఒక ఎంపిక కాదు అవసరం.. మహిళలకు సురక్షితంగా పనిచేసే ప్రదేశం- వేధింపులపై మౌనాన్ని వీడడం. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు సురక్షితం-సవాళ్లు పరిష్కారాలు.. మహిళల భద్రతకు భరోసా ఇవ్వడంలో పురుషుల పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహణ. సమాజంలోని మహిళలో ఆత్మస్థైర్యాన్ని, మహిళల శక్తిని, స్వీయ రక్షణసామర్థ్యాన్ని పెంపొం దించడమే ప్రధాన ధ్యేయం. మహిళా సమస్యల పరిష్కారంనకు విద్యార్థుల యొక్క ఆలోచనలు, వారి నైపుణ్యం వెలికితీయడానికి వక్తృత్వ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి. అందులో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు జిల్లా వ్యాప్తంగా నిర్వహణ. వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తీకరించారు. మార్చి 08న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అడిషనల్ యస్.పి. (అడ్మిన్) సౌజన్య, టౌన్ డీస్పీ సింధు ప్రియ, ఉమెన్ పీస్ సీఐ సుబ్బారావు, డీటీసీ సీఐ నాగేశ్వరమ్మ ఆర్ ఐ వెల్ఫేర్ రాజారావు, జడ్జిలుగా సీనియర్ లెక్చరర్స్, పలు పాఠశాల, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర-మనుబోలు: ఈనెల 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు వెంకటాచల మండలం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ విజయలక్ష్మి ఆదేశాల మేరకు జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మనుబోలు మండలం పిడూరు హరిజనవాడలోని అంగన్వాడి సెంటర్ నందు మనుబోలు సెక్టార్ సూపర్వైజర్ సిహెచ్ రమణమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తల్లులను సమావేశం పరిచి తల్లులకు న్యూట్రిషన్ ఫుడ్ బాల్య వివాహాల గురించి పిల్లల చేత యోగ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా కిషోర్ బాలికలు, తల్లులు, గర్భవతులకు అవసరమైనటువంటి ఆహారపు అలవాట్లను, అలాగే ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయురాలు నళిని, సూపర్వైజర్ రమణమ్మ, అంగన్వాడి కార్యకర్త విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-జలదంకి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా జలదంకి బీసీ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. మహిళలకు ఆరోగ్యం, పౌష్టికాహారం, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు విజయ కుమారి, అంగన్వాడీ సూపర్వైజర్ హైమావతి, మహిళా పోలీసు శ్రీవాణి పాల్గొన్నారు.

## చంద్రన్న పాలనలోనే మహిళా సంక్షేమం

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ తెలిపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆర్థిక మేలు కలిగేలా నిర్ణయం తీసుకుంది. టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ అందజేసి, వారికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయ నున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశా రు. నియోజకవర్గంలోని టైలరింగ్ శిక్షణ నేర్చుకోవా లనుకునే మహిళలు కందుకూరు నియోజకవర్గంలోని ఎమ్ఎల్ఏ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాల్సిం దిగా తెలుపుచున్నాము. కావలసిన పత్రములులి ఆధార్ కార్డు రేషన్ కార్డులి పాస్ పోర్ట్ సైజ్ ఫోటోమొబైల్ నెంబర్ తోపాటు ఎమ్మెల్యే ఆఫీసులో అందజేయవలెను.

## అదానీ కృష్ణపట్నం పోర్ట్ లో జాతీయ భద్రతా దినోత్సవం

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: భద్రతా ప్రమాణాలు నిరంతరం పాటిస్తూ ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలని తద్వారా సురక్షితమైన అనుకూలమైన కార్యనిర్వహణ వాతావరణాన్ని అనుక్షణం ఉండేటట్లుగా చూసుకోవాలని అదానీ కృష్ణ పట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ చెప్పారు. కృష్ణ పట్నం నౌకాశ్రయంలో జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా జెండాను ఎగుర వేసిన తరువాత సిఇఒ మాట్లాడుతూ, భద్రత ప్రతీ ప్రాంతంలో సుస్పష్టంగా కనిపించాలని ఆ నిబద్ధతతో ప్రతి ఒక్కరూ విధిగా పని చేయాలని చెప్పారు. ఏదైనా దురదృష్టకర సంఘటన జరిగితే ఆ వ్యక్తి యొక్క కుటుంబం ఎక్కువగా ప్రభావితమవుతుంది కాబట్టి పని ప్రదేశంలో ప్రమాదాల ప్రమాదాల నుండి తనను తాను రక్షించుకోవాలి. అందువల్ల ప్రమాదకర ప్రవర్తనలను తొలగించడం ద్వారా భద్రత అనేది వ్యక్తిగత అజెండా అని ఆయన అన్నారు. ఎకెపిఎల్ బృందం 2025 మార్చి 4 నుండి 10 వరకు 54వ జాతీయ భద్రతావారోత్సవ వేడుకలను 'అభివృద్ధి చెందిన భారత దేశానికి భద్రతా ఆరోగ్యము చాలా అవసరం' అనే ఇతివృత్తంతో జరుపుకుంటోంది. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధిపతులు కార్మికులు పాల్గొన్నారు.

# అంతా ఓపెన్..

- నిస్సిగ్గుగా చూచి రాతలు
- కావలి ఓపెన్ స్కూల్ పరీక్షా కేంద్రాలు నవ్వుల పాలు

విశాలాంధ్ర-కావలి: ప్రస్తుతం జరుగుతున్న ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో చూచి రాతలే రాజ్యమేలుతున్నాయి. ఇందుకోసం ముందస్తుగా అందరిని మచ్చిక చేసుకుని చూచి రాతలను స్వయంగా స్క్వాడ్ అధికారులే ప్రోత్సహిస్తుండడం దారుణం. కావలి పట్టణంలోని ఐదు కేంద్రాల్లో ప్రస్తుతం ఓపెన్ ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో సుమారుగా 120 నుంచి 150 మంది వరకు పరీక్షార్థులు హాజరవుతున్నారు. వాళ్లు పరీక్షకు హాజరవ్వడమే తప్పు అసలైన పరీక్ష మాత్రం వట్టి మాటే. ప్రశ్నాపత్రంతోపాటు జవాబు పత్రాలు కూడా ముద్రించినవి అందజేస్తారు. ఆ జవాబు పత్రాలు చూస్తూ రాసుకుంటూ వెళ్లిపోతుండడమే పరీక్ష గదిలో జరిగే అతిపెద్ద తంతు...ఇందుకుగాను ముందు నుంచే ఓ భారీ కార్యాచరణ కొనసాగుతుండడం గమనార్హం. ఓపెన్ పరీక్షల్లో సిట్టింగ్ స్క్వాడ్‌గా రాటు తేలిన కావలి జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చిరంజీవి ఈ మొత్తం వ్యవహారంలో చాలా కీలకంగా ఉన్నాడు. ఆయనకు గతంలో అక్రమాలకు తోడుంటూ వచ్చిన అల్లూరు మండలం ఇసుకపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రస్తుతం ఈ ధారావాహికలో మాత్రం నటన నిలిపివేసి వ్యక్తిగత అనారోగ్య కారణంగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. సిట్టింగ్ స్క్వాడ్ వ్యాయామ ఉపాధ్యాయుడిగా వెలగబెడుతున్న చిరంజీవి ది గ్రేట్ నడుపుతున్నతంగంలో మొత్తం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో అభ్యర్థి నుంచి 15 నుంచి 20వేల రూపాయలు వరకు వసూలు చేస్తున్నట్లు బాధితుల ద్వారా అందుతున్న సమాచారం. వాస్తవంగా కూడా చదివి పరీక్ష రాసి మంచి మార్కులు తెచ్చుకోగల అభ్యర్థులను సైతం వీరు పట్టిపీడిస్తున్నారు. ఈయనకు తోడుగా కావలి మండలం ముసునూరు కు చెందిన అంజయ్య అనే ఉపాధ్యాయుడు సహా బోగోలు మండలం మంగమూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మాధవ చక్రం తిప్పుతున్నారు. ఒక్క రోజు విధులు నిర్వహించే ఇన్విజిలేటర్ ప్రభుత్వం ఇచ్చే పారితోషకానికి 10రెట్లుగా వీరిచ్చే మాములు మొత్తాలు ఉన్నాయి. మండల విద్యాధికారులు ఇద్దరికీ భారీగానే ముట్ట చెబుతున్నారు డిప్యూటీ డిఈఓ నుంచి జిల్లా విద్యాధికారి అటు నుంచి ప్రాంతీయ విద్యాశాఖ సహాయ సంచాలకుల వరకు అందరికీ లక్షల్లో ముడుపులందుతుండడం మొత్తం విద్యావ్యవస్థనే బజారుకు ఈడుస్తుంది. ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ నుంచి పరీక్ష రాసే వరకు మొత్తం వ్యవహారం మామూళ్లపర్వంగానే ఉండటం విమర్శలకు తావిస్తుంది. కావలి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల (189913)బాలిక ఉన్నత పాఠశాల(189909) పాతూరు నాలుగో వార్డ్ ఉన్నత పాఠశాల(189911) 8వ వార్డు ఉన్నత పాఠశాల(189910) వెంగళరావు నగర్ శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలల్లో(189912) ప్రస్తుతం ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు అక్కడ ఎవరిని అడిగిన వాళ్ల వసూళ్ల చదువులు తల్లికి జరుగుతున్న భంగపాటు గురించే కథలుగా చెబుతారు.